

హౌస్ అరెస్ట్ అయిన బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, నాయకులు

ఉద్రిక్తతల మధ్య హౌసింగ్ బోర్డు స్థలాల వేలం

ఒకవైపు వేలం.. మరోవైపు అరెస్టులు

- అడ్డుకుంటామన్న ప్రకటనతో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకుల హౌస్ అరెస్టు
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం
- అత్యధికంగా గజం రూ.1.85 లక్షలు
- 11 ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపని కొనుగోలుదారులు

కూకట్‌పల్లి : కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం నిర్వహించిన ప్లాట్ల వేలం ఉద్రిక్తతల నడుమ జరిగింది. హౌసింగ్ బోర్డు పక్కా రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థగా మారి మోసపూరితంగా భూములను అమ్ముతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపూరిత వైఖరిని ఎండగడుతూ రోడ్డులో పోతున్న పాట్ల వేలం విక్రయ ప్రక్రియను నిలిపివేయాలని, లేకుంటే అడ్డుకుంటామని ఎమ్మెల్యే గతంలోనే ప్రకటించడంతో పోలీసులు ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ కార్పొరేటర్‌లు, ముఖ్య నాయకులను హౌస్ అరెస్టు చేశారు.

కొన్ని ప్లాట్లకు మాత్రమే భారీ స్పందన

వేలం పాటలో కొన్ని ప్లాట్లకు మాత్రం భారీ స్పందన వచ్చింది. హౌసింగ్ బోర్డులోని 5వ ఫేజ్‌లో గల కేవలం 30 గజాల ప్లాట్ గజంస్థలం అత్యధికంగా రూ.1.85 లక్షల ధర పలికి రికార్డు సృష్టించింది. హౌసింగ్ బోర్డు స్థలాల్లో 24 ప్లాట్లను వేలం వేసేందుకు నోటిఫికేషన్ వేయగా.. అందులో 9వ ఫేజ్‌లో ఉన్న ఓ ప్లాట్‌కు సంబంధించి కోర్టును ఆశ్రయించటంతో ఆ ప్లాట్ వేలం ఆగిపోయింది. దీంతో శుక్రవారం 23 ప్లాట్లను వేలం వేశారు. అందులో 12



ఎమ్మెల్యే నివాసం వద్ద భారీగా మోహరించిన పోలీసులు



ఎమ్మెల్యే నివాసానికి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

ప్లాట్లు మాత్రమే అమ్ముడు పోయినట్లు తెలుస్తోంది. మిగిలిన 11 ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదని పలువురు తెలిపారు. కూకట్‌పల్లి వెస్ట్రన్ డివిజన్ పరిధిలోని ఇంకా కొన్ని ప్లాట్లను సోమవారం కూడా వేలం వేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు

హౌసింగ్ బోర్డు స్థలాల వేలం పాటను నిరసిస్తూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపు మేరకు బీఆర్ఎస్ కార్పొరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున నిరసనల్లో పాల్గొన్నారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కార్పొరేటర్ల నివాసాల వద్దకు చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు.

అరెస్టులు అప్రజాస్వామికం

మూసాపేట: సమస్యలపై ప్రజల పక్షాన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పోరాటం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనతో పాటు బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. హౌస్ అరెస్టు అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీగా అధికారుసమస్యలపై పోరాడకూడదా అని ఆయన ప్రశ్నించారు.

పోరాటానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా తన పోరాటానికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ప్రభుత్వ స్థలాల వేలం పాటకు నిరసనగా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆ స్థలాలను ఉపయోగించాలనే తన పోరాటమన్నారు.

రోడ్డులో పోతున్న ప్లాట్ల వేలం నిలిపివేయాలి

– ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

రోడ్డులో పోతున్న ప్లాట్ల వేలాన్ని నిలిపివేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి ఎక్కడికక్కడ హౌస్ అరెస్టు చేశారు. నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మాధవరం నివాసానికి తరలి వచ్చారు. ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నలుగురు ఇన్‌స్పెక్టర్లు, నాలుగు పోలీస్‌స్టేషన్ల సిబ్బందిని మోహరించి వేలం పాటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాన్య ప్రజలు హౌసింగ్ బోర్డు చేతిలో మోసపోవద్దని సూచించారు. ఏకంగా హుడా మాస్టర్ ప్లాన్‌లో 100 ఫీట్ల రోడ్డుగా చూపిన కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లోని ఖాళీ స్థలాలను, 200 ఫీట్ల రోడ్డుగా చూపి 7వ ఫేజ్‌లోని ఖాళీ స్థలాలను మోసపూరితంగా 80 అడుగుల రోడ్డుగా చూపుతూ రోడ్డు స్థలాలను అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. గడిచిన ఐదు రోజులుగా రోడ్డు స్థలాలను వేలం వేయవద్దని, సామాన్య ప్రజలను మోసం చేయవద్దని హౌసింగ్ బోర్డు అధికారులను కోరినప్పటికి పట్టించుకోకపోవడంతో వేలాన్ని అడ్డుకుంటామని ప్రకటించినట్లు తెలిపారు. 80 ఫీట్ల రోడ్డుగా నమ్మించి అమ్ముతున్న ఖాళీ స్థలాలను కొనుగోలు చేసిన వారు రోడ్డు విస్తరణతో ప్లాట్లను కోల్పోతారన్నారు. జీవో నంబర్ 6 ప్రకారం వంద గజాల లోపు స్థలాల్ని పక్క ఇంటి వారికి లేదా పక్కనే ఉన్న ప్లాట్ల యజమానులకు మార్కెట్ విలువ ప్రకారం కేటాయించాల్సి ఉన్నప్పటికీ వేలానికి పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ భూములను అమ్మితే అన్ని సక్రమంగా ఉంటాయని సామాన్య ప్రజలు నమ్మకంతో కొంటారని, హౌసింగ్ బోర్డు అధికారులు మాత్రం ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డులో ప్లాట్ పోతే కొన్న వారికి రోడ్డు నిర్మాణం చేస్తున్న సంస్థ నష్ట పరిహారంగా టీడీఆర్ ఇస్తుందని చెబుతున్న బోర్డు అధికారులు అదే టీడీఆర్‌ను వారే తీసుకోవచ్చు కదా? అని ప్రశ్నిస్తే మాత్రం సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీఆర్ గృహ నిర్మాణ సంస్థ అయిన హౌసింగ్ బోర్డుకు ఎక్కువగా ఉపయోగపడుతుందని, సామాన్యులకు పావు వంతు కూడా ఉపయోగం ఉండదన్నారు. పోలీసులు కూడా పరిధి దాటి వ్యవహరిస్తున్నారనీ, చట్ట ప్రకారం వేలం పాటలో పాల్గొనే హక్కు ఉన్నప్పటికీ అనుమతించకపోవటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మోతీనగర్: పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మోతీనగర్ కమిటీ హాల్‌లో బీజేపీ మూసాపేట డివిజన్ అధ్యక్షులు కన్నెగంటి ఎర్ర స్వామి ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షుల సమావేశం శుక్రవారం జరిగింది. మూసాపేట డివిజన్‌లోని 47 బూత్ అధ్యక్షులను, మూసాపేట డివిజన్ అధ్యక్షులుగా నియమితులైన ఎర్ర స్వామిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, నాయకులు మల్లేష్ గౌడ్, సద్గుణ రెడ్డి, శైలేష్, ఐలయ్య, రమేష్ నాయర్, రవిగౌడ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిక్స్ డిపార్టుమెంట్ అవినీతిపై విచారణ చేపట్టాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: బిక్స్ డిపార్టుమెంట్‌లో జరుగుతున్న అవినీతిపై, భయటపడ్డ ఆడియో రికార్డింగ్‌లపై పూర్తి స్థాయి విచారణ జరపాలని జేఎస్‌టీయూహెచ్ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆర్ఎస్‌క్యూ 1ని వెంటనే బాయ్స్ హాస్టల్‌గా మార్చాలన్నారు. అర్హులైన ప్రతి విద్యార్థికి హాస్టల్ సౌకర్యం కల్పించాలని, హౌస్ కీపింగ్ ఉద్యోగుల జీతాలను పెంచాలని ధర్నా నిర్వహించారు.

సైన్యం ఆయుధాల ప్రదర్శన





మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని లులుమాల్‌లో శుక్రవారం భారత సైన్యం వాడే ప్రత్యేక ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ప్రదర్శించారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలు వీక్షించడానికి వివిధ రకాల రైఫిల్స్, అధునాతన తుపాకీలు, ఆయుధాలు, రాత్రి సమయంలో శత్రువులను పసిగట్టే బైనాక్యులర్స్, రాకెట్స్ వంటివి ప్రదర్శనలో ఉంచారు. ఆయుధాలు ఎలా పని చేస్తాయో సైనికులు ప్రజలకు వివరించారు. 26 వరకు ప్రతి రోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పట్టని పట్టణ ప్రగతి

- ముగియనున్న పురపాలక సంఘాల పాలకవర్గం గడువు
- ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- రూ. లక్షల్లో పన్నులు వసూలు.. ముందుకు సాగని అభివృద్ధి పనులు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా ఏర్పడిన నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాలిటీల పాలకవర్గం గడువు ఈ నెల 26తో ముగియనుంది. ఈ ఐదేళ్ల కాలంలో సంబంధిత పురపాలక సంఘాల పాలకవర్గం హయాంలో జరిగిన అభివృద్ధి ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి వెళ్లిన తీరు కనబడుతోంది. నగర శివారు పట్టణాల్లో పన్నుల వసూళ్లపై చూపిన శ్రద్ధను పురపాలికలు అభివృద్ధిపై చూపకపోవటంతో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. కొన్ని పురపాలికల్లో చిన్న పాటి వర్షం పడితే.. రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి.

◆ శివారుల్లోని గ్రామ, నగర పంచాయతీల విలీనంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలుగా అవతరించినా.. ఇక్కడి ప్రజల సమస్యలు మాత్రం వర్ణనాతీతంగా దర్శనమిస్తున్నాయి. శివారు పట్టణాలను హైదరాబాద్ నగరానికి సమాంతరంగా అభివృద్ధి పరచటానికి ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు రూపొందించినా.. ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

సమీకృత మార్కెట్లు అంతే..

జిల్లాలో 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్లకు అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని కేటాయించిన అధికార యంత్రాంగం.. జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో మార్కెట్ భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణానికి రూ.4.5 కోట్ల చొప్పున, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున అప్పటి సర్కారు నిధులు మంజూరు చేసింది. అయితే ఈ నిధుల విడుదల జాప్యంతో నాలుగున్నర ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ఒకటి కూడా ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

పట్టణాల్లో అభివృద్ధి ఇలా..

శివారుల్లోని అతిపెద్ద నగర పాలక సంస్థ బోడుప్పల్‌లో 1.50 లక్షల జనాభాతో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా ఏటా రూ.60 కోట్ల ఆదాయం వచ్చినా.. ప్రజలు మాత్రం అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, నీటి సరఫరా పైప్‌లైన్ల లీకేజీలు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌లో 230.2 కిలోమీటర్ల డ్రైనేజీలు ఉండగా, ఇందులో కచ్చ డ్రైనేజీలు 35 కిలోమీటర్లు, వర్షపు వరద నీరు డ్రైనేజీలు ఏడు కిలోమీటర్లు వరకు ఉన్నాయి. 346.30 కిలోమీటర్ల రోడ్లు ఉండగా, ఇందులో మట్టి రోడ్లు 36.5 కిలోమీటర్ల వరకు ఉన్నాయి.

◆ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో లక్షకు పైగా జనాభాతో 80 కాలనీలు ఉండగా, ఏటా పన్నుల ద్వారా రూ.30 కోట్ల ఆదాయం సమకూరినప్పటికీ ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. 215 కిలోమీటర్ల డ్రైనేజీలు ఉండగా, ఇందులో కచ్చ డ్రై నేజీలు 32 కిలోమీటర్లు, 240 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. మట్టి రోడ్లు కూడా 9 కిలోమీటర్ల వరకు ఉన్నాయి. ఈ పట్టణాల్లో ఎడతెరపిలేకుండా వర్షాలు కురిస్తే ప్రజలు నానా అగచాట్లు పడాల్సివస్తోంది. మిగతా 2 నగరపాలక సంస్థలు, 9 మున్సిపాలిటీల్లో కూడా ప్రజలు అవే సమస్యలతో బాధపడుతున్నారు.

కోట్లల్లో పన్నులు.. ఇతర వనరులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కొక్క పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. ఈ నిధులన్నింటిని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవటం లేదు.

సమస్యలివే..

పురపాలక సంఘాల్లో చెత్తా, డ్రైనేజీ, పారిశుద్ధ్యం సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామానికి తక్కువ, పట్టణానికి ఎక్కువ అన్న రీతీలో పురపాలక సంఘాల్లో అభివృద్ధి సాగుతోంది. ఖాళీ స్థలాల్లో పేరుకపోయిన చెత్తాతో దోమల బాధను భరించలేని పరిస్థితులను ప్రజలు ఎదుర్కొవలసి వస్తోంది. పలు పురపాలికల్లో రోడ్లపై పారుతున్న మురికి, వరద నీటికి ఆ పరిసరప్రాంతాలు దోమలకు కేంద్రంగా మారుతున్నాయి.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం




మూసాపేట: కూకట్‌పల్లిలోని టీజీఎస్ ఆర్‌టీసీ కూకట్‌పల్లి డిపోలో శుక్రవారం ఘనంగా డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రాఫిక్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, కూకట్‌పల్లి డిపో మేనేజర్ డి. హరి పాల్గొన్నారు. ఉత్తమ డ్రైవర్లు బాబు, కరీముద్దీన్, ఇలియాస్‌లను అభినందించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, వెల్ఫేర్ సభ్యులు లక్ష్మి, శ్రీనివాసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. సమతానగర్ కాలనీలో రూ.22 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ సాయినగర్‌లో నాలా వెంట నిర్మించిన ఓ అక్రమ నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. కోర్టు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో టీపీఎస్ సోమేష్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. నాలాల వెంట, ప్రభుత్వ భూముల్లో ఎవరైనా కబ్జాకు పాల్పడి అక్రమ నిర్మాణం చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. కొన్ని నెలలుగా ఈ స్థలం వివాదంతో కోర్టు పరిధిలో ఉండటంతో పోలీసుల బందోబస్తు మధ్య సర్కిల్ అధికారులు కూల్చివేత చేపట్టారు.

లొంగిపోకుంటే ఆస్తులు జప్తు

కుత్బుల్లాపూర్: పలు కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులు వెంటనే కోర్టులో లొంగిపోవాలని మేడ్చల్ 12వ అడిషనల్ జ్యూడిషియల్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన అనీల్‌రాయ్(32) పై 337, 336, 304–ఏ సెక్షన్ కింద, ఉత్తరప్రదేశ్ మధురయ్ జిల్లాకు చెందిన బ్రిజ్వాసీ(20)పై సెక్షన్ 304–ఏ, ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాకు చెందిన శ్రీకాంత్(25) పై 302, 201, 120 సెక్షన్ కింద కేసులు నమోదయ్యాయన్నారు. వీరు పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతుండటంతో ఈ నెల 25వ తేదీ లోగా మేడ్చల్ కోర్టులో గాని, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గాని సదరు నిందితులు లొంగిపోవాలని మేడ్చల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. నిందితులు సకాలంలో లొంగిపోని పక్షంలో ఆస్తులు జప్తు చేయాలని జడ్జి ఆదేశించినట్లు సీఐ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ ఇంద్రనగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి. రాజ్‌కుమార్ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన మృతదేహంపై పూలమాలేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

‘ఎస్‌సీఐఐఎన్‌వీ బయోసైన్సెస్’ స్టార్టప్‌కు అరుదైన అవకాశం

మైక్రోసాఫ్ట్ ‘ఏఐ’ కాఫీ టేబుల్ బుక్‌లో అవకాశం

రాయదుర్గం: హెచ్‌సీయూలో స్టార్టప్‌గా ఎదిగిన ఎస్‌సీఐఐఎన్‌వి బయోసైన్సెస్‌కు ప్రతిష్టాత్మకమైన మైక్రోసాఫ్ట్‌కు ప్రత్యేకమైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాఫీ టేబుల్‌బుక్‌లో అవకాశం లభించింది. మైక్రోసాఫ్ట్ సంస్థలోని కాఫీ టేబుల్ బుక్‌లో టాప్–200 ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లు కొనసాగుతున్నాయి. తమ వ్యాపారాలను మార్చుకోవడానికి ఏఐ శక్తిని ఉపయోగించుకుంటున్నాయి. ఈ స్టార్టప్ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లను అంచనా వేయడానికి, రోగి ఆరోగ్య చరిత్రను ఏఐ/ఎంఎల్ అల్గారిథమ్‌లను ఉపయోగించేలా చేస్తుంది. ఈ అత్యాధునిక ఆవిష్కరణ ప్రయోగాల సామర్థ్య పరిమితులను అంచనా వేస్తుంది. హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ రెడ్డన్న, ఎస్‌సీఐఐఎన్‌వీ బయోసైన్సెస్ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ రంగారెడ్డి బుర్రి మాట్లాడుతూ అంటువ్యాధుల నివారణలో వేగం, ఖచ్చితత్వాన్ని గణనీయంగా పెంచుతుందన్నారు.

విధులతో పాటు పిల్లల బాధ్యత ముఖ్యం

రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్

గచ్చిబౌలి: మహిళా పోలీసు అధికారులు, పోలీసులు తమ విధులతో బాటు పిల్లల సంరక్షణను కూడా బాధ్యతాయుతంగా చూసుకోవాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ ప్రాంగణంలో క్రైచే ప్రీ స్కూల్‌ను ఆయన కమిషనర్ అవినాష్ మహంతితో కలిసి శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఆలోచన మేరకు సైబరాబాద్ కమిషనరేట్‌లో పనిచేసే సిబ్బంది పిల్లలు చదువుకునేందుకు ఈ స్కూల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కమిషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్‌లో డీజీపీ సృజన ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల భద్రతా విభాగం ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించబడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ డి జోయల్ డేవిస్, డీసీపీ సృజన, డాక్టర్ మై స్కూల్ ఇటలీ వ్యవస్థాపకురాలు డాక్టర్ అపర్ణా వల్లూరు , పోలీసుల అధికారులు ప్రసన్నకుమార్, ఇతర అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



అక్రమంగా నీటి సరఫరా చేసే వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, స్థానికులు. - కూకట్‌పల్లి